వీఎస్‌టీ వర్కర్స్ సంక్షేమానికి కృషి చేస్తా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాజిద్ సుల్తానా టుబాకో (వీఎస్‌టీ) వర్కర్స్ సంక్షేమం కోసం తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో కనివినీ ఎరగని విధంగా వర్కర్స్ అభివృద్ధి కోసం అనేక అగ్రిమెంట్లు చేశామన్నారు. స్వర్గీయ మాజీ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి సహకారంతో వర్కర్లకు అన్ని విధాల భరోసా కల్పించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అయిలి ప్రభాకర్, ఆఫీస్ బేరర్స్ బాబ్జి, రవియాదవ్, నరేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆలయంలో జరగనుంది. ఆలయ ఈఓ మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని వివరించారు.

మద్యం తాగి వ్యక్తి మృతి

కాచిగూడ: మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిపాల్‌రెడ్డి (40) కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని ఎస్వీఎస్ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై మద్యం సేవించి అపస్మారక స్థితిలో పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వారు.. వదిలేశారు

- పైపులైన్ పనులు పూర్తయినా రోడ్లకు మరమ్మతులు చేయని వైనం
- జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయ లోపం
- గుంతల మయమైన రోడ్లు, ఇబ్బంది పడుతున్న వాహనదారులు



రత్నానగర్ స్ట్రీట్ నంబర్ 6 లో రోడ్డును చూపుతున్న బస్తీవాసులు

నల్లకుంట: జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయలోపం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. జలమండలి డ్రైనేజీ, సీవరేజీ పనుల కోసం బస్తీలలోని అంతర్గత రోడ్లను తవ్విపోస్తుంది. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. తవ్విపోసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించడంలో చూపిస్తున్న శ్రద్ధను రోడ్ల మరమ్మతులు చేయించడంపై చూపడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- జలమండలి, జీహెచ్ఎంసీ విభాగాల అధికారులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు నల్లకుంట డివిజన్ పరిధిలోని చాలా బస్తీలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యంగా జలమండలి ఆయా ప్రాంతాల్లో చేపట్టిన డ్రైనేజీ, సీవరేజీ పనుల కోసం బస్తీలు, కాలనీలలోని రోడ్లను తవ్విపోశారు. చాలాచోట్ల పనులు పూర్తయినప్పటికీ తవ్విపోసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టింది. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. తవ్వేసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిన జీహెచ్ఎంసీలోని సంబంధితశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుంతల కారణంగా ఎగుడు దిగుడుగా మారిన రోడ్లపై నడక సాగిస్తూ.. బస్తీలోని వృద్ధులు, చిన్న పిల్లలు గాయాల పాలవుతున్నారని బస్తీ పెద్దలు వాపోతున్నారు.
- రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాలబారిన పడుతూ.. ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- తవ్వి వదిలేసిన రోడ్డు కారణంగా డ్రైనేజీ పైపులను ఆనుకుని ఎలుకలు, పంది కొక్కులు సొరంగాలు చేస్తూ.. సమీపంలోని ఇళ్ల పునాదులు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పందికొక్కులు, ఎలుకలు ఇళ్లల్లోని బాత్రూంలలో చేరి డ్రైనేజీ పైపులను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్వి వదిలేసిన రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని పలుసార్లు జీహెచ్ఎంసీ అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.
- బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివాసం ఉండే బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



రత్నానగర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు ఇలా..

డ్రైనేజీ పైపులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది



డ్రైనేజీ పనుల కోసం రోడ్లను తవ్విపోశారు. పనులు పూర్తయి ఐదు నెలలకు పైగా అవుతోంది. తవ్విపోసిన రోడ్లకు ఇంకా మరమ్మతులు చేపట్టడం లేదు. పేదల బస్తీలపై నిర్లక్ష్య ధోరణి సరైనది కాదు. అధికారులు అలసత్వాన్ని వీడకుంటే పంది కొక్కులు, ఎలుకలు డ్రైనేజీ పైపులను కూడా ధ్వంసం చేసే ప్రమాదం ఉంది. డ్రైనేజీ పైపులు ధ్వంసమైతే కలుషిత నీటి సమస్యలు తలెత్తుతాయి.

– ఆర్. నర్సింగ్‌రావు, బస్తీవాసి

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



బస్తీలోని పెద్ద గల్లీలో డ్రైనేజీ పైపులైన్ పనులు ముగిసి నెలలు గడుస్తున్నాయి. తవ్విపోసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లు గుంతల మయంగా మారాయి. ఆ గుంతల కారణంగా పంది కొక్కులు, ఎలుకలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుసార్లు జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తవ్వి వదిలేసిన రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– ఈశ్వర్, బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయ్‌భాస్కర్ తెలిపారు. డీడీహెచ్ ఫీడర్ పరిధిలో విజ్ఞానపురికాలనీ, వీఎస్‌టీ మెయిన్ రోడ్డు, దయానంద్‌నగర్, ఎస్ఆర్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11 గంటల వరకు, అడిక్‌మెట్ ఫీడర్ పరిధిలో అడిక్‌మెట్, రాంనగర్‌గుండు, లలితానగర్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో జమిస్తాన్‌పూర్, లలితానగర్, అంబర్‌నగర్, రాంనగర్‌గుండు తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 4.30 వరకు, ఎల్ఎస్‌నగర్ ఫీడర్ పరిధిలో వారసీగూడ, అశోక్‌నగర్ నాలా, పుల్లయ్య బావి తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

ముషీరాబాద్: జవహర్‌నగర్, ఇందిరాపార్కు 33/11 కేవీ ఫీడర్స్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సైఫాబాద్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు జవహర్‌నగర్ పరిధిలోని జగదాంబ నర్సింగ్‌హోమ్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, గాంధీనగర్ పార్ట్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్కు ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, ఎన్టీఆర్ గార్డెన్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ గాంధీనగర్‌లో ఒక పార్ట్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయం



వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర మాజీ మంత్రి, దివ్యాంగుల తొలి ఎంపీ జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్' జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 16న జయంతి, జూలై 28న జైపాల్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం గొప్ప పరిణామమన్నారు. జైపాల్‌రెడ్డి పేరుతో సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతులను నిర్వహించాలన్నారు.

చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: పేదలకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేత బాబ్జీ సాయికీర్త్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందని అభిప్రాయపడ్డారు. శీలం సత్యనారాయణ, పింజర్ల సురేష్, గుండు జగదీష్‌బాబు, గుండు సురేందర్, రాజు, నరేందర్‌యాదవ్, రమేష్, సురేష్, సురేందర్ తదితరులున్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ముద్రలోన్ చెక్కును పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



స్మార్థట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఆర్థికసాయం అందజేస్తున్న కేంద్రమంత్రి

కాచిగూడ: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలో ఎస్‌బీఐ బర్కత్‌పుర బ్రాంచి ద్వారా అర్హులైన పేదలకు మంజూరైన ముద్రలోన్ చెక్కులను కేంద్రమంత్రి అందజేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన కోరారు. ఉజ్వల గ్యాస్ దరఖాస్తులు, జీరో అకౌంట్ దరఖాస్తులు, ఆధార్‌కార్డుల అప్‌డేట్ ఫారాలను ఈ సందర్భంగా ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, నల్లకుంట కార్పొరేటర్ అమృత, బ్యాంక్ మేనేజర్ సంధ్య, డాక్టర్ మనోజ్ రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, నందకిషోర్ యాదవ్, కన్నె రమేష్ యాదవ్, కేసరి నర్సింగ్‌యాదవ్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, శీర్‌సాగర్, మల్లికార్జున్, బల్వీర్, భీమ్‌రాజ్, ఎం.నర్సింగ్‌రావు, హజారీబాబు, ఆర్.సంతోష్, కృష్ణ, నందు, సురేష్, ఎస్.రవియాదవ్, లావణ్య, సారిక, తార, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములవ్వాలి..

కాచిగూడ: సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని, పేదలకు సహాయ, సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో స్మార్థట్రస్ట్ చైర్మన్ శరత్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఆర్థికసాయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అందజేశారు. పేదలకు ఆర్థికసాయం చెయ్యాలనే ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ఏబీవీపీ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, బీజేపీ నేతలు ఎడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కరినోము ఉత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం : చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గోదా అమ్మవారి కరినోము ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగా సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం కార్యక్రమం కనుల పండుగగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఎస్సీవర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి



వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: మాదిగల చిరకాల కోరికైన ఎస్సీవర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం బిల్లును రాజ్యాంగ సవరణ చేసి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టకుండా కోర్టులు, కమిటీలు అంటూ.. కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఆగిపోయి 20 ఏళ్లవుతున్నా.. రాజకీయ పార్టీలు నాటి కాంగ్రెస్, నేటి బీజేపీని విమర్శించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని నాటి నుంచి నేటి వరకు వివిధ సందర్భాల్లో చెప్పి మందకృష్ణ మాదిగ నేడు ఆ అంశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై అనేక తీర్మానాలు చేసి వర్గీకరణ చేసుకునే వెసులుబాటు రాష్ట్రాలకు అప్పజెప్పాలనే మాదిరిగానే కేంద్రం కూడా కొనసాగించి రాష్ట్రాలకు అప్పజెప్పాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, హుస్సేన్, చాప కృష్ణ, గుడ్ల మోహన్‌రావు, రాజేష్‌కన్నా, కొల్లూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'హిందువుల ఓట్ల కోసమే బీజేపీ రాజకీయం'



బహుదూర్ యార్ జంగ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: దేశంలో అత్యధికంగా ఉన్న హిందూ ఓటర్లను కైవసం చేసుకోవాలనే తపనతో బీజేపీ నేతలు హిందుత్వంతో రాజకీయం చేస్తున్నారని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. దేశంలో జరుగుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలే దీనికి నిదర్శనం అన్నారు. మంగళవారం ఎంఐఎం పార్టీ వ్యవస్థాపకుడు బహదూర్ యార్ అంజ్ వర్ధంతి సందర్భంగా ముషీరాబాద్‌లోని ఆయన సమాధిని సందర్శించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. త్వరలో దేశంలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హిందుత్వం పేరుతో బీజేపీ హిందూ ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. దేశంలో సెక్యులరిజం ఎటు దారితీస్తుందో హిందూ సోదరులు, ముస్లింలు ఆలోచించాలన్నారు. రాహుల్‌గాంధీ చేపడుతున్న యాత్ర ఆ పార్టీ వ్యక్తిగతమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు మహ్మద్ మోబిన్, కౌశర్ మోహియుద్దీన్, ఎమ్మెల్సీలు రహమత్‌బేగ్, మీర్జారియాజ్ ఉల్ హసన్, మాజీ ఎమ్మెల్యే పాషాఖాద్రి, ఎంఐఎం కార్పొరేటర్లు స్థానిక నేతలు జాఫర్‌ఖాన్, యామిన్‌ఖాన్, దావుద్ అలీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురం

- పతంగులతో యువత సందడి
- ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపిన స్థానిక నేతలు



మాజీ మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నారాయణ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు

కాచిగూడ: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎటు చూసినా పండుగ ఉత్సాహమే కనిపించింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా పతంగులతో పోటీపడ్డారు. ఇళ్ల ముందు వేసిన రంగురంగుల ముగ్గులు కనువిందు చేశాయి. కాచిగూడ, బర్కత్‌పుర, నింబోలిఅడ్డ, లింగంపల్లి, నారాయణగూడ, గోల్నాక, చెప్పల్‌బజార్, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో ప్రజలు సంక్రాంతి ఉత్సవాల్లో మునిగితేలారు. ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా.. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా పతంగులను ఎగురవేస్తూ సందడి చేశారు.



నారాయణ స్కూల్‌లో..

నారాయణగూడలోని నారాయణ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ హర్‌నీత్‌కౌర్, వైస్ ప్రిన్సిపాల్ మోహీ ఉస్సీసా చేతుల మీదుగా మెడల్స్ , ప్రశంసాపత్రాలను అందజేశారు. స్కూల్ ఏజీఎం బాల పరమేశ్వర్, కో–ఆర్డినేటర్ భవాని పాల్గొని ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోవద్దని వారు సూచించారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కులో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవి చారితో కలిసి పతంగులు ఎగురవేశారు. సుమారు గంటపాటు వాకర్స్ సభ్యులతో కలిసి పతంగులు ఎగరవేస్తూ.. సంబరాలు నిర్వహించుకున్నారు. వాకర్స్ సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులు వివేక్, వెంకట కృష్ణారావు, మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎం.ఎస్.రావు, క్లబ్ సీనియర్ సభ్యులు సునీతారెడ్డి, పద్మాగౌడ్, శ్రీదేవిగౌడ్ తదితరులున్నారు.

చిక్కడపల్లి: డివిజన్‌లోని నేతాజీనగర్ బస్తీలో పిల్లలకు స్థానిక కార్పొరేటర్ పావనీవినయ్ కుమార్ గాలిపటాలు (పతంగ్)లను మంగళవారం పంపిణీ చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ.. పిల్లలు, యువకులు పతంగులను ఎగురవేయాలని, మహిళలందరూ ఇంటి ముందు రంగురంగులు ముగ్గులు వేసి సంతోషంగా పండుగ నిర్వహించుకోవాలన్నారు. బీజేపీ నాయకులు మంగమ్మ, హనుమంతు, ఆకుల అభిషేక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటితో దేవిరెడ్డి విజితారెడ్డి

నల్లకుంట : అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. చాలా మంది ప్రజలు తమ ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. ఇంటిల్లిపాది పిండివంటలు ఆరగించి మధ్యాహ్నం నుంచే యువకులు, చిన్నారులు ఇంటి దాబాలపైకి చేరుకుని పతంగులు ఎగురవేస్తూ.. ఆనందంగా గడిపారు.



సుందరయ్యపార్కులో పతంగులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్



పతంగులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



పూజల్లో ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గంలోని బాకారం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి (మల్లన్న) దేవాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవ మహోత్సవంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి ఆలయానికి చేరుకుని కార్పొరేటర్ దంపతులకు స్వాగతం పలికారు.



బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నేత శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలోని ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబికామల్లికార్జునస్వామి (మల్లన్న) కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువ నాయకుడు ముఠా జైపాల్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు ఊరేగింపుగా బోనాలను తీసుకొచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అశోక్‌నగర్‌కు చెందిన రాంపురి రాజేన్‌నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జోగిని అవిక ఆలయానికి వచ్చి బోనం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి మాట్లాడుతూ.. మల్లన్న జాతర మహోత్సవాలు ఈ సంవత్సరం వైభవంగా జరిగాయని, సహకరించిన పోలీసులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు బింగి నవీన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పూస గోరక్‌నాథ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాలి శ్రీకాంత్‌గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, మేడి సురేష్‌కుమార్, రామానందరెడ్డి తదితరులున్నారు.



పట్టువస్త్రాలు సమర్పించిన అంజన్‌కుమార్‌యాదవ్

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



పిల్లలతో సునీత (ఫైల్)

కాచిగూడ: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి పిల్లలతో కలిసి వెళ్లిన తల్లి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సునీత (39) భర్తతో గొడవపడి గాంధీనగర్ లంకబస్తీలో నివసిస్తున్న తమ్ముడి వద్దకు వచ్చింది. సునీత దంపతులకు చైత్ర (11), త్రిలోచన్ (9), మానిష్ (7) సంతానం. కాగా ఈనెల 9న తమ్ముడి ఇంటి నుంచి పిల్లలతో కలిసి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లుగీత వృత్తిని కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్: ప్రపంచీకరణ నేపథ్యంలో రోజురోజుకు అంతరించిపోతున్న కల్లుగీత వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీనియర్ జర్నలిస్ట్, సంపాదకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గీతవృత్తి ప్రమాదంతో కూడుకున్నదని, దీుతుకుదెరువుగా చేసుకొని కొన్ని లక్షల కుటుంబాలు తమ జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. ఆధునిక హంగుల పేరుతో రియల్ ఎస్టేట్ రంగం ఈత, తాటిచెట్లను నరికివేస్తుండటంతో వీరి వృత్తి, జీవనాధారం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హిమాయత్‌నగర్ మఖ్దూమ్‌భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర గీత పనివారాల సంఘం – 2024 నూతన సంవత్సర కేలండర్‌ను కె. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా రామాయంపేటలో కొంతమంది సంఘవిద్రోహ శక్తులు వందలాది ఈత చెట్లకు నిప్పుపెట్టి గీత వృత్తిని ప్రమాదంలోకి నెట్టివేశారని, ఈ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ.సాయిలుగౌడ్, రాష్ట్ర కేంద్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషం, ఉపాధ్యక్షులు కేవీ.ఎల్, నాయకులు ఎం.ప్రవీణ్‌కుమార్, యాదయ్య, చాపల అంజయ్య, యాదయ్యగౌడ్, బింగి సైదులు, శ్రీధర్ తదితరులున్నారు.